## క్లుప్తంగా

### అమర్తలూరులో వైద్య శిబిరం



అమర్తలూరు(వేమూరు): పేద ప్రజలకు ముందుస్తు వైద్య సేవలు అందించడం జరుగుతుందని అమర్తలూరు మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని లూథరన్ చర్చి వద్ద శుక్రవారం స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు రొమ్ము క్యాన్సర్, గొంతు, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులకు గుర్తించేందుకు ముందస్తు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై రచ్చబండ



భట్టిప్రోలు(వేమూరు): ప్రభుత్వం ప్రజా సమస్యలపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని ఐలవరం గ్రామంలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు హిందు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేనేత కార్మికులకు చేసిన వాగ్దానాలు అమలు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. భట్టిప్రోలు బౌద్ధ స్థూపాన్ని పరిశీలించి, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొని రావడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



కర్లపాలెం: ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలని బాపట్ల చలపతి డెంటల్ వైద్యశాల వైద్యుడు డాక్టర్ విన్నకోట నారాయణరావు చెప్పారు. కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని పెదపులుగువారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాపట్ల చలపతి డెంటల్ వైద్యశాల వైద్య బృందం దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 100 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేసి సత్యసాయి గ్రామీణ సేవా సమితి ఆధ్వర్యంలో పేస్ట్‌లు, బ్రష్‌లు, మౌత్‌వాష్ లిక్విడ్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆట్ల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ అక్కల శ్రీనివాసరెడ్డి, కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితి ప్రతినిధి తుమ్మల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

### సామాజిక చైతన్య దీప్తి తాపీ ధర్మారావు



తెనాలి: అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని సామాజిక చైతన్యానికి కృషిచేసిన మహోన్నతుడు తాపీ ధర్మారావు అని శుక్రవారం జరిగిన సంస్మరణలో వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో ప్రముఖ రచయిత తాపీ ధర్మారావును సంస్మరణను ఆయన జయంతిరోజున జరిపారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ఎంవీ రఘునాధరావు మాట్లాడుతూ వ్యవహారిక భాష అభివృద్ధికి కృషిచేసిన ధర్మారావు ప్రజాచైతన్యానికి పలు రచనలు చేశారని సోదాహరణంగా చెప్పారు. 'అరసం' జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ మాట్లాడుతూ ప్రజాజీవన విధానాన్ని తాపీ ధర్మారావు తన రచనల్లో ఇమిడ్చి జనాభ్యుదయానికి కృషిచేశారని చెప్పారు. సభలో లక్కరాజు లక్ష్మణరావు తన ప్రసంగంలో తాపీ ధర్మారావు సినీ రచనలు వివరించారు. 'ఇస్కఫ్' సభ్యురాలు శ్రీదేవి, సీపీఐ తెనాలి నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి మాట్లాడారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# అసలే గుంతలు.. ఆపై వర్షాలు

- అధ్వానంగా వేమూరు–చావలి రోడ్డు
- గుంతల్లో నిలిచిన వర్షపు నీరు
- రోడ్డు వేయాలని కోరుతున్న గ్రామస్తులు



వేమూరు నుంచి చావలి వెళ్లు రోడ్డు గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

వేమూరు: వేమూరు నుంచి చావలి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారయింది. రోడ్డుపై ఎక్కడ చూసినా అడుగుకో గుంత కనపడుతుంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అసలే గుంతల రోడ్డు.. ఆపై నియోజకవర్గంలో గత నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణం మరింత కష్టంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమూరు నుంచి చావలి వెళ్లు రోడ్డులో గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వెళ్లాటానికి నరకంగా ఉందని వాహనదారులు అంటున్నారు. ఈ రోడ్డుపై నిత్యం బలిజేపల్లి, చావలి గ్రామానికి చెందిన ప్రజలు వందల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. ప్రభుత్వం రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ఆరోపిస్తున్నారు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వేమూరు–చావలి రోడ్డును వేశారు. అయితే నిత్యం రద్దీగా ఉండడం, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం మరమ్మతు పనులు కూడా చేపట్టలేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. రాత్రి సమయంలో గుంతలు కనబడక.. ఈ రోడ్డుపై వెళ్లడం మరింత ఇబ్బందిగా మారిందని, దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. వేమూరు నుంచి బలిజేపల్లి, చావలి, పెరవలి, పెరవలిపాలెం గ్రామాల ప్రజలు ఈ రోడ్డు ఉపయోగిస్తారు. వర్షాలకు రోడ్డుపై గుంతల్లో నీళ్లు నిలిచిపోవడంతో గుంత లోతు తెలియక ప్రమాదాలు సంభవిస్తున్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లో రోడ్లు మొత్తం పూర్తి చేస్తామని ఎన్నికల ముందు చెప్పింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా రోడ్లు మాత్రం వేయడం లేదని పలువురు వాపోతున్నారు. వేమూరు నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. చుండూరు మండలంలోని కారుమూరిపాలెం నుంచి మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు గుంతల్లో సైకిల్ నడిపించుకొని పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. గతంలో వారు రోడ్డు ఫొటో తీసి సోషల్ మీడియాలోనూ పెట్టారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు రోడ్డు గురించి పట్టించుకోలేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అంటున్నారు.

### రోడ్డు వేయాలి



రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణం చేయడం చాలా కష్టంగా ఉంది. రాత్రి సమయంలో ప్రయాణం మరింత నరకంగా మారింది. కూటమి ప్రభుత్వం వేమూరు నుంచి చావలి వెళ్లు రోడ్డు వెంటనే వేయాలి.

– విష్ణుమొలకల వెంకటేశ్వరరావు, చావలి

### నరకంగా ఉంది



రోడ్లు గుంతలు పడటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం చాలా కష్టంగా ఉంది. ప్రతి రోజు కారమూరు నుంచి మండూరు, చినగాదెలవర్రు నుంచి చినపరిమి జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లడం విద్యార్థులకు నరకంగా ఉంది. ప్రభుత్వం వెంటనే రోడ్డు వేయాలి.

– ఉయ్యూరి సుబ్బారెడ్డి, కారుమూరిపాలెం, చుండూరు

## పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం వైద్య విద్యను దూరం చేస్తుంది

**రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్**



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

చెరుకుపల్లి: ఎంతో కష్టపడి చదువుకుంటున్న పేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం వైద్య విద్య దూరం చేసే కుట్రలకు తెర తీస్తుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చలో మెడికల్ కాలేజి నిరసన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువత రేపల్లె నియోజకవర్గ నుంచి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో బైక్‌లతో ర్యాలీగా బాపట్ల మెడికల్ కళాశాల వద్దకు తరలివెళ్లారు. ముందుగా గుళ్ళపల్లి గణేష్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర సంపదను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన 15 ఏళ్ల పాలనలో ఏనాడైనా ఒక్క మెడికల్ కళాశాలనైనా నిర్మించారా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో 17 మెడికల్ కళాశాలలకు అనుమతులు తెచ్చి వాటిలో ఐదు కళాశాలలు ప్రారంభించటం జరిగిందన్నారు. ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయటం ద్వారా ప్రతి కళాశాలలో సంవత్సరానికి 150 వైద్య సీట్లు, ఐదు సంవత్సరాల తరువాత 50 పీజీ సీట్లు, మరో మూడు సంవత్సరాల తరువాత 30 సూపర్ స్పెషాలిటీ సీట్లు పేద విద్యార్థులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక విద్యార్థి వైద్య విద్య చదవటం చాలా కష్టంతో, ఆర్థిక భారంతో కూడుకున్నదని అది ఒక డాక్టర్‌గా స్వయంగా అనుభవించానని గణేష్ అన్నారు. అనంతరం ర్యాలీగా బాపట్ల మెడికల్ కళాశాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని యువత, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## చిన్నారుల పోషణలో పురుషుల భాగస్వామ్యంపై అవగాహన



తూర్పుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ధనలక్ష్మి

చెరుకుపల్లి: పోషకాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ చెరుకుపల్లి సెక్టారు సూపర్‌వైజర్ డి.ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం పల్లపల్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తూర్పుపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ్ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం, చురుకైనపాత్ర గురించి వివరించారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం, పోషణ, సంరక్షణ అనేవి మహిళల బాధ్యతలే కాదని పురుషులు కూడా భాగస్వాములవ్వాలని తెలిపారు. పురుషులు శిశు సంరక్షణలో సహకారం, తండ్రిగా పిల్లల ఆహారం, నిద్ర, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ, గర్భిణులు పోషకాహారం సమయానికి తీసుకునేలా చూడటం, గర్భిణులను ఆరోగ్య పరీక్షలకు తీసుకువెళ్లి ప్రత్యేక శ్రద్ధ చూపడం వంటివి చేయాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలపై అవగాహన**



కుచ్చెళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న అమృతవాణి

వేమూరు: కుటుంబ సభ్యులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు అంగన్‌వాడీ కేంద్రం–2లో పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై అంగన్‌వాడీ తల్లులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు పొందే ఆహారం తీసుకోవాలని సూచించారు. మునగాకుతో వివిధ పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. అలాగే మునగాకుతో చపాతీ తయారీని చేసి చూపించారు. ఆహారంలో ఎక్కువగా ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. శిశువులకు 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ కె.అనసూయ, టి.వెంకయమ్మ, తల్లులు పాల్గొన్నారు.

## పంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంచుకోవాలి

**ఎంపీపీ వెంకట లలితకుమారి**





మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు: ప్రతి గ్రామ పంచాయతీలో సొంత ఆదాయ వనరులను పెంపొందించుకోవడం ద్వారా పంచాయతీలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. సొంత ఆదాయ వనరుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లలితకుమారి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాలైన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు కేవలం కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల పైనే ఆధారపడుతున్నాయని కానీ సొంత ఆదాయ వనరులను పెంచుకోవడానికి మార్గాలను అన్వేషించడం లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్లతో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా పనులు చేయాలని తెలిపారు. పంచాయతీ ఖాళీ స్థలాల్లో సైకిల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అద్దె వసూలు చేయవచ్చని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఈ విధంగా ఆలోచించి పంచాయతీ ఆదాయం పెంచుకోవడానికి కృషి చేయాలని తెలియజేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో విజయబాబు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గ్రాంట్‌లు, పన్నులు, లీజు, లైసెన్సులు, విరాళాలు వీటన్నిటిపై అవగాహన ఉండాలని అన్నారు. అన్ని ఇళ్లకు సరైన నిబంధనల ప్రకారం ఇంటి పన్ను వేయడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని అన్నారు. అదేవిధంగా సెల్ టవర్ల వారి దగ్గర కూడా లైసెన్స్ ఫీజు వసూలు చేయాలని అన్నారు. సర్పంచులు, గ్రేడ్ల పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాలలో అవకాశం ఉన్న మేరకు సొంత ఆదాయ వనరులను పెంచుకోవడానికి కృషి చేయాలని తెలియజేశారు. మాస్టర్ ట్రైనర్లుగా వక్కలగడ్డ సురేష్, దోమ ఉదయభాస్కర్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పంచాయతీలో సొంత ఆదాయ వనరుల అవగాహన సదస్సులో ఎంపీడీవో రవికుమార్

వేమూరు: గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులను పెంపొందించుకోవడం ద్వారా అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడుతున్నాయని ఆయన తెలిపారు. మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా పంచాయతీలకు సొంత ఆదాయం వస్తుందన్నారు. పంచాయతీ ఖాళీ స్థలాల్లో సైకిల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అద్దెకు వసూళ్లు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, డిప్యూటీ ఎంపీడీవో చొప్పర శేఖర్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసరెడ్డి, సాదిక్ అలీ పాల్గొన్నారు.

### గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

అమర్తలూరు(వేమూరు): గడ్డి మందు తాగి నార్ల జగన్మోహన్‌రావు (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన నార్ల జగన్మోహనరావు ప్రమాదవశాత్తూ కింద పడటం వల్ల ఎడమ చేతికి గాయం అయింది. నొప్పిని భరించలేక మనస్థాపంకు గురయిన జగన్మోహనరావు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో గడ్డి మందు తాగాడని ఎస్ఐ రవితేజ తెలిపారు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారన్నారు. చికిత్స పొందతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. భార్య నార్ల అలివేలుమంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవితేజ తెలిపారు.

### అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యం



తెనాలిఅర్బన్: దోమల నియంత్రణపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో మారీసుపేట, పినపాడు, శాంతినగర్‌లలో దోమల నియంత్రణ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉండే నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. అవి లేకుండా చూసుకోవాలన్నారు. ఇవి కుట్టడం వలన జ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఉండే పాత కూలర్లు, ఫ్రీజులు, గాబులు వంటి వాటిని ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, మండల మలేరియా సబ్‌యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు, షేక్ రషీ ద్, సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# తెనాలిలో యూటీఎఫ్ రణభేరి జాత

- ప్రదర్శనలో భారీగా పాల్గొన్న ఉపాధ్యాయులు
- కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించటం లేదని నిరసన





మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల ప్రదర్శనను తెనాలిలో శుక్రవారం భారీగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యకు తగిన పరిష్కారం లభించకపోవటంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడలో వేలాదిమందితో 'రణభేరి'ని నిర్వహించనున్నారు. ఇందుకు సన్నాహకంగా సెప్టెంబరు 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అయిదు రకాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేయాలని యూటీఎఫ్ నిర్ణయించింది. అందులో భాగంగా రణభేరి జాతాను శుక్రవారం గుంటూరులో ప్రారంభించి, తెనాలిలో ముగించారు. ఈ ప్రదర్శనలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతోందని ఆరోపించారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వమే విద్యావ్యవస్థను బలహీనపరచిందన్నారు. తాత్కాలిక నియామకాలు మినహా శాశ్వత నియామకాలు లేవని, విద్యాహక్కు చట్టం అమలు పేరుతో మూడోవంతు ప్రాథమిక పాఠశాలలు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారాయనీ, హైస్కూళ్లలో టీచర్ల సమస్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ సమస్యలతో ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించటం లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మనోహర్ అన్నారు. ఈనెల 25న విజయవాడలో జరగనున్న రణభేరిని విజయవంతం చేయాలని కోరారు. ప్రదర్శనలో యూటీఎఫ్ ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, సహ అధ్యక్షులు జీవీ నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, గౌరవ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె.సాంబశివరావు, కె.కామాక్షి, ఆదినారాయణ, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ఎల్ మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.కేదార్‌నాథ్, రాష్ట్ర కౌన్సిలర్ ఆదిలక్ష్మి, బసవేశ్వరరావు, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: డ్రోన్‌సాయంతో జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తెనాలి రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని సంగమేశ్వర స్వామి గుడికి సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ఉనన్న చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్టు డ్రోన్ సాయంతో గుర్తించారు. రూరల్ ఎస్ఐ ఆనంద్, సిబ్బంది సాధారణ దుస్తుల్లో అక్కడికి వెళ్లి 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,62,450 నగదు, రెండు బైక్‌లను స్వాధీన పర్చుకున్నారు. అక్కడ పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్న చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన దుర్గా, మరో ఇంకొక నలుగురు పరారీలో ఉన్నారు. మొత్తం 17 మంది మీద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో తుషార్‌డూడీ విశేష కృషి

**ఎస్పీ బి.ఉమామహేశ్వర్**



ఎస్పీ తుషార్‌డూడీను సన్మానిస్తున్న జిల్లాలోని పోలీస్ అధికారులు

బాపట్లటౌన్: జిల్లాలో శాంతిభద్రతల పరిక్షణలో ఎస్పీ తుషార్‌డూడీ విశేష కృషి చేశారని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. బాపట్ల జిల్లా నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు ఎస్పీగా వెళ్లిన తుషార్‌డూడీకి వీడ్కోలు సన్మాన కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని గౌతమీ గ్రాండ్‌లో నిర్వహించారు. బాపట్ల ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో, సమస్యాత్మక విషయాలను సున్నితమైన కోణంలో పరిష్కరించే విధానం అలవర్చుకోవడం తుషార్‌డూడీ గొప్ప లక్షణమన్నారు. బదిలీపై వెళ్తున్న చిత్తూరు జిల్లాలో కూడా ఇదే విధమైన శైలిలో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తుషార్‌డూడీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ అధికారులు వారికి అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించిన ఫలితంగానే జిల్లాలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించగలిగామని తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలమురళీ కృష్ణ, రేపల్లె, బాపట్ల, చీరాల డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైల్వే కార్మికుల ధర్నా

తెనాలిరూరల్: ఎనిమిదో పే కమిషన్‌ను వెంటనే నియమించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తెనాలి శాఖ కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. మజ్దూర్ యూనియన్, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పే కమిషన్‌ను నియమించడంలో ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. తక్షణ చర్యలు తీసుకోకుంటే రైల్వే కార్మికుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న రైల్వే కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సురక్షిత గ్రామాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ల్యాంప్ సంస్థ ప్రతినిధులు

తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మైఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్. అనురాధ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన ల్యాప్ సంస్థ కో–ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహహింస లేని గ్రామాలను 'సురక్షిత గ్రామాలు' అంటారన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా కార్యదర్శులు మహాలక్ష్మి, రత్నకుమారి, ల్యాంప్ సంస్థ ప్రతినిధి టి మంగయ్య, ఉపాధ్యాయులు అమర్నాథ్, విద్యార్థులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, అషిమూన్, స్వరూప, ప్రశాంతి, చింతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కామిక్ బుక్స్ పంపిణీ చేశారు.

### ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా చూడండి



తెనాలిఅర్బన్: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశించారు. అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, తహసీల్దార్ గోపాలకృష్ణ, బీఎల్‌వోలు మున్సిపల్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు వంటి వాటిపై సూచనలు ఇచ్చినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.